## నేడు. మద్దిలేటి స్వామి హుండీ లెక్కింపు..

విభారే న్యూస్. అక్టోబర్ 28. బేతంచర్ల.. వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి స్వామి. క్షేత్రంలో భక్తులు వివిధ రూపాయి నా సమర్పించిన కానుకలను నేడు మరియు రేపు లెక్కిస్తున్నట్టు ఉప కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి రామాంజనేయులు తెలిపారు



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A:L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 29-10-2024 సంపుటి : 06 సంచిక : 34 పేజీలు : 8 వెల : రూ 3-00


# టాటా-ఎయిర్‌బస్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

### స్పెయిన్ ప్రధానితో రోడ్ షో
### లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీ




గాంధీనగర్, అక్టోబర్ 28 : భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఇద్దరూ కలిసి సోమవారం గుజరాత్‌లోని వడోదరలో టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ఇద్దరూ కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ రోజు (సోమవారం) ఇరుదేశాధి నేతలు చారిత్రాత్మకమైన లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీలో పాల్గొననున్నారు. కాగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు చెందిన ఈ ఫెసిలిటీని సైనిక విమానాల తయారీ కోసం ఉపయోగిస్తారు. మన దేశంలో మొట్టమొదటి ప్రైవేటురంగ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఇదే కావడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా ఈ ఫెసిలిటీలో మొత్తం 40 విమానాలను తయారు చేస్తారు. ఏవియేషన్ దిగ్గజ కంపెనీ 'ఎయిర్‌బస్' నేరుగా 16 విమానాలను భారత్‌కు అందించనుంది. టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ ప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. సైనిక విమానాల తయారీ కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ రంగ ప్లాంట్ ఇదేనని తెలిపింది. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భారత్‌లో 40 విమానాలను తయారు చేసే బాధ్యతలు తీసుకుంటుంది. ఈ ఫెసిలిటీ దేశంలోనే తొలి ప్రైవేట్ సెక్టార్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌గా నిలిచింది. తయారీ నుంచి అమరిక వరకు సమస్త వ్యవస్థ ఇక్కడే ఉంటుంది. విమానాలను టెస్టింగ్ చేయడం నుంచి డెలివరీకి అవసరమైన అర్హత ప్రమాణాలను కూడా ఇక్కడే నిర్వహిస్తారు" అని పేర్కొంది. కాగా టాటా కంపెనీలతోపాటు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు కూడా తమ సహకారాన్ని అందించనున్నాయి. కాగా వడోదరలో ఏర్పాటు చేసిన ఫైనల్ అసెంబ్లీ లైన్‌కు అక్టోబర్ 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. నిర్మా ణం పూర్తయ్యి అందుబాటు లోకి రావడంతో ఇవాళ ప్రారంభించారు.

# ఆస్టిన్, డల్లాస నగరాల్లో మంత్రి లోకేశ బిజీబిజీ

### టెస్లా సీఎఫ్ఓతో భేటీ.. పెట్టుబడులపై సుదీర్ఘ చర్చ



అమరావతి, అక్టోబర్ 28 (ఆర్ఎన్ఎ) : పెట్టుబడల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటన సాగుతోంది. అమెరికాలోని ఆస్టిన్, డల్లాస్ నగరాల్లో మంత్రి బిజీబిజీగా గడుపుతున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులపై వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలతో నిమగ్నమయ్యారు లోకేష్. రాష్ట్రానికి వీలైనన్ని పరిశ్రమలు తీసుకురావాలన్న లక్ష్యంతో లోకేష్ టూర్ కొనసాగుతోంది. టెస్లా కేంద్ర కార్యాలయాన్ని సందర్శించిన లోకేష్.. టెస్లా సీఎఫ్ఓ వైభవ్ తనేజాతో సమావేశమయ్యారు. ఈవీ రంగానికి అనంతపురం అనుకూలమైన ప్రదేశం పెట్టుబడులు పెట్టండి అంటూ టెస్లా కంపెనీని కోరారు. స్మార్ట్ సిటీలు, గ్రామీణ విద్యుదీకరణ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించాలని కోరారు. అలయెన్స్ టెక్సాస్ తరహా ప్రాజెక్టులకు ఏపీ తీరప్రాం తం అనుకూలమని చెప్పారు. దీనిపై టెస్లా సీఎఫ్ఓ వైభవ్ తనేజా సానుకూలంగా స్పందించారు. అలాగే రాస్ పెరోట్ జూనియర్‌తో ఏపీ మంత్రి భేటీ అయ్యారు. ఆపై డల్లాస్‌లో పెరోట్ గ్రూప్ చైర్మన్ రాస్ పెరోట్ జూనియర్‌తోనూ మంత్రి లోకేష్ సమావేశమయ్యారు. కాగా.. టెస్లా కేంద్ర కార్యాలయ సందర్శన కోసం లోకేష్ ఆస్టిన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో మంత్రికి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నేషల్ మీడియాతో మాట్లాడిన ఆయన.. టెస్లా కంపెనీని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చే కృషి కొనసాగుతుందని, ఈ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని చెప్పారు. ఏపీ ప్రభుత్వం అనుసరిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానం వల్ల ఏపీకి రావడానికి అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయని లోకేష్ వెల్లడించారు.

# రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయి

### ఇందుకు జగన్ జీవితమే ఉదాహరణ
### తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు



అమరావతి, అక్టోబర్ 28 : రాజకీయాల్లో హత్యలు ఉండవని.. ఆత్మహత్యలే ఉంటాయనడానికి జగన్మోహన్ రెడ్డి రాజకీయ జీవితమే తాజా ఉదాహరణ అని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్‌సీఎల్‌టీలో తల్లిపై, చెల్లిపై కేసులేయడం ద్వారా జగన్ పూర్తిగా పాతాళానికి కూరుకుపోయారన్నారు. అందులో నుంచి అతన్ని బయటకు తీయడం దేవుడెరుగు, జగన్ చేయి పట్టుకున్నోళ్లంతా పాతాళంలోకే అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇది ఆస్తుల వివాదం కాదని.. ఇది రాజకీయ ఆత్మహత్యే అని.. చివరికి జగన్ తన సొంత తల్లిని, చెల్లిని కూడా మోసం చేశారంటూ మండిపడ్డారు. వాళ్ల కుటుంబ తగాదాలు వాళ్లే రోడ్డుకీడ్చుకుని ఆ బురద మీడియాపైకి నెట్టడం హాస్యాస్పదమన్నారు. షర్మిలకిచ్చిన రూ.200 కోట్లు జగన్‌కు ఎక్కడివని ప్రశ్నించారు. 10 ఏళ్లలో రూ. 200 కోట్లు ఇచ్చానని జగన్ పేర్కొన్నా ఇప్పటికీ ఐటీ, ఈడీ ఎందుకు స్పందించడంలేదని అడిగారు. గత నాలుగైదు రోజులుగా పుంఖానుపుంఖాలుగా జగన్ అక్రమాస్తుల రగడ మీడియాలోనే కాదు, పబ్లిక్‌గా జరుగుతుంటే ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థల్లో కదలికలేవి అని నిలదీశారు. క్విడ్ ప్రో కో 1.0, క్విడ్ ప్రో కో 2.0 ప్రో కో కేసులన్నీ ఇప్పటికైనా ఒక కొలిక్కి తేవాలని.. ఒక ఆర్థిక నేరస్తుడు 11 ఏళ్లుగా బెయిల్‌పై ఉండటమేమిటని అన్నారు. 136 డిశ్చార్జి పిటిషన్లు వేసి తనపై కేసుల విచారణను ముందుకు సాగకుండా ఆర్థిక ఉగ్రవాది ఇలా న్యాయవ్యవస్థకే కొరుకుడు పడని కొయ్యగా మారితే, దర్యాప్తు సంస్థలకే పెను సవాళ్లు విసురుతుంటే భారత రాజ్యాంగం ఉనికికే ప్రమాదమన్నారు. భారత శిక్షాస్మృతికే అవమానమన్నారు."కుటుంబ యుద్ధం - అక్రమాస్తుల కోసం సిగపట్లు - జగన్ పొలిటికల్ సూసైడ్" అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే అనేక మంది వైసీపీని వీడుతున్నారని.. సురక్షిత ఆశ్రయం కోసం వేరే పార్టీల్లో చేరుతున్నారన్నారు. ఇక భవిష్యత్తులో జగన్ మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తారనుకోవడం పగటికలే అని.. అందుకే ఎవరికి వారు దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలన్న ఆరాటంతో ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్‌గా పోటీబడి వైసీపీ నుంచి దూకేస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సగం మునిగిపోయిన నావ, పూర్తిగా మునిగిపోకముందే అందరూ దూకేయడం బెటర్ అని ఉచిత సలహా ఇచ్చారు.

# జగన్ రహస్య జీవోలకు వెలుగు

### వెబ్‌సైట్‌లో పెట్టాలని ప్రభుత్వం ఆదేశం

అమరావతి,అక్టోబర్ 28 : వైకాపా హయాంలో రహస్యంగా ఉంచిన జీవోలను జీవోఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2021 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 28 వరకూ గోప్యంగా ఉంచిన జీవోలన్నింటినీ ఆ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ మేరకు సాధారణ పరిపాల శాఖ కార్యదర్శి ఎస్.సురేష్ కుమా ర్ ఉత్తర్వులు జారీ చేశారు. రహస్యంగా ఉంచిన అన్ని జీవోలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం జీవోఐఆర్ వెబ్‌సైట్‌ను పునరుద్ధరించి పాత జీవోలన్నింటినీ అందులో అప్‌లోడ్ చేయాలని ఐటీ ఎలక్ట్రానిక్స్ శాఖ అధికారులకు సూచించారు. వెబ్‌సైట్ ప్రారంభమైన 2008 నుంచి ఇప్పటి వరకూ అన్ని ప్రభుత్వ ఉత్తర్వులూ జీవోఐఆర్ వెబ్ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయని సాధారణ పరిపాలన శాఖ పేర్కొంది. అయితే వైకాపా ప్రభుత్వ హయాంలో 2021 ఆగస్టు 15 నుంచి 2024 ఆగస్టు 28 వరకు ఉన్న జీవోలు మాత్రం అందుబాటులో లేకుండా పోయాయని తెలిపింది. ప్రభుత్వం విడుదల చేసే అధికారిక ఉత్తర్వులు పౌరులకు అందుబాటులో ఉండాల్సిందేనని సాధారణ పరిపాల శాఖ పేర్కొంది. వాటన్నింటిని అప్‌లోడ్ చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు సురేష్ కుమార్ వెల్లడించారు.

# పిజిఆర్ఎస్ కు 198 విజ్ఞప్తులు

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 28---ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 198 అర్జీలు వచ్చాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని సెంటినరీ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం - (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వీకరించిన ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై సియంఓ కార్యాలయం నుండి నిరంతరం తనిఖీ చేస్తున్నారని ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా వెంటనే స్పందించి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలన్నారు. ఇంకా 30 ఫిర్యాదులు చూడకపోవడం, బియాండ్ ఎస్ఎల్ఏ లో 29 దరఖాస్తులు, రీ ఓపెన్ అయిన దరఖాస్తులు 205 పెండింగ్ లో ఉన్నాయన్నారు. 72 గంటలకు మించి ఒక్క గ్రీవెన్స్ కూడ పెండింగులో ఉండకూడదని గతంలో ఆదేశాలు ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయని సంబంధిత తాసిల్దారులతో సమావేశాలు నిర్వహించి ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు గైకొనాలన్నారు. ఫిర్యాదుదారులకు తెలుగులో అర్థం అయ్యే రీతిలో అర్థవంతంగా వ్రాసి ఎండార్స్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఏపీ సేవా సర్వీసులకు సంబంధించిన దరఖాస్తులు కూడ అధిక సంఖ్యలో పెండింగ్లో ఉన్నాయని వెంటనే క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈ కార్యక్రమంలో 198 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ...

### - రక్తదానం మరొకరికి ప్రాణదానం జిల్లా ఎస్పీ




విభారె న్యూస్ అక్టోబర్ 28 కర్నూలు జిల్లా ప్రతినిధి..పోలీసు అమర వీరుల త్యాగాల స్ఫూర్తితో రక్తదానం చేసిన జిల్లా ఎస్పీ.జిల్లా పోలీసు కార్యాలయంలో ఉచిత రక్తదాన శిబిరం.రక్తదానం మరొకరికి ప్రాణదానమని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసే ప్రాణ దాతలుకావాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపియస్ పేర్కొన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు వారి సహకారంతో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు.జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో జిల్లా ఎస్పీ రక్తదానం చేశారు.ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... విధి నిర్వహణలో కర్తవ్యమే లక్ష్యంగా ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల స్ఫూర్తితో ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు.రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ కల్పించడమేనన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో రక్తం దానం చేయడం చాలా కీలకం అవుతుందన్నారు. అలాంటి ఆపద సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం అదృష్టంగా భావించాలన్నారు. రక్తదానం చేయడంపై ప్రజలకు అవగాహన కల్గించాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసు అధికారులకు,పోలీసు సిబ్బంది కి జిల్లా ఎస్పీ ఫ్రూట్ జ్యూస్ మరియు బిస్కెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్,డిఎస్పీలు బాబు ప్రసాద్, శ్రీనివాసరావు,పోలీసు వేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి,కర్నూలు గవర్నమెంట్ హస్పిటల్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ కిరణ్, సిఐలు,ఆర్ ఐలు ఎస్సైలు,ఆర్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 29-10-2024

## డిజిటల్ అరెస్టులు ..పారాహుషార్..!

డిజిటల్ అరెస్ట్..ఇప్పుడీ భయం ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనాను మించి భూతంలా వెన్నాడుతోంది. అనేకులు మోసపోతున్నారు. బెదరించి..బ్లాక్ మెయిల్ చేయడం ద్వారా ఖాతాలను కొల్లగొట్టేస్తున్నారు. ఇలాంటి ఫేక కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసం చేస్తున్నాడని గుర్తించి పోలీసులను అప్రమత్తం చేయాలి. ఓ రకంగగా ఇలాంటి కాల్స్ వస్తే తిరస్కరించడమే మేలు. డిజిటల్ అరెస్టల క్రమంలో భారత్ అప్రమత్తం అయ్యింది. బాధితులు హేతుబద్ధంగా ఆలోచించే వ్యవధి ఇవ్వరాదనే సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు, తక్షణం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు వంటి మాటలతో భయపెట్టాలని చూస్తున్నారు. దేశీయంగా ప్రభుత్వ ఏజెన్సీలు అధికారిక లావాదేవీలకు వాట్సప్ లేదా స్కైప్ వంటి వేదికలను ఉపయో గించవు. ఎవరైనా ఫోన్‌కాల్ లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించి.. మీ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్నామని చెబితే బెంబేలు పడిపోకుండా అవతలి వ్యక్తులతో మాట్లాడి వారి గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. మోసగాళ్లు మిమ్మల్ని మభ్యపెట్టి బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తారు. ఇటువంటి సందర్భాల్లో మన భయం వారి పని సులువు చేస్తున్నదనే విషయాన్ని గుర్తించాలి. చట్టబద్ధమైన ఏజెన్సీలు ఏవీ తక్షణం డబ్బు పంపాలని ఒత్తిడి తీసుకురావు. సైబర్ నేరాలకు స్పందించే ముందు ఒక క్షణం ప్రశాంతంగా ఆలోచించాలి. తెలియని నంబర్లకు ఫోను ద్వారా, వీడియోకాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం, ఆర్థికపరమైన వివరాలు ఇవ్వరాదు. పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే మరింత జాగ్రత్తగా, ఎప్పటికప్పుడు ఇటువంటి పరిణామాలు తెలుసుకొంటూ ఉండటం అవసరం. ఒక్కోసారి చట్టబద్ధమైన సంస్థల లోగోలు కూడా మోసగాళు వాడుతుంటారు. లాటరీ తగిలిందనే సందేశాలు వచ్చినపుడు గుడ్డిగా నమ్మడం, దురాశకు పోవడం చేస్తే సులువుగా దోచేస్తారు. వైద్య చికిత్సల కోసమని, ఫేక్ ఛారిటీ అప్పీళ్లతో భావోద్వేగాలను బలహీనతగా వాడుకునే కుంభకోణాలు, చట్టబద్ధమైన హైరింగ్ పోర్టల్స్ లేదా సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఉపాధి పోస్టులు పెట్టి నిరుద్యోగులను మోసగించే వైనాలు కూడా ఉంటున్నాయి. వినియోగదారులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం ఆసరాగా చేసుకొని వైరస్ గురించి హెచ్చరించడం ద్వారా రహస్యంగా కంప్యూటర్‌ను యాక్సెస్ చేసి సున్నితమైన వ్యక్తిగత సమాచారం అపహరిస్తారు. త్వరగా డబ్బు సంపాదించాలనే బలహీనతను ఆసరాగా చేసుకొని పెట్టుబడి కుంభకోణాలు, ఫేక్ ఆన్‌లైన్ స్టోర్లతో క్యాష్ ఆన్ డెలివరీ మోసాలు కూడా పెరుగుతున్నాయి. పొరపాటున మన ఖాతాకు పంపిన డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరడం.. ఓటీపీలు అడగటం.. డ్రగ్స్ పార్శిళ్లు వచ్చాయనే బెదిరింపులు, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వజూపటం వంటి ఎత్తుగడల్లో సైబర్ నేరగాళ్లు నైపుణ్యం సాధించారు. దేశంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో దజనుకు పైగా సూచనలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ సీఈఆర్‌టీ–ఐఎన్' కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఆఫ్ ఇండియా అత్యవసర పబ్లిక్ అడ్వయిజరీని జారీ చేసింది. భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం 'మన్ కీ బాత్'లో సైబర్ నేరాల గురించి ప్రజలను హెచ్చరించారు. అసలు 'డిజిటల్ అరెస్టు' అన్నదే పెద్ద ఆన్‌లైన్ కుంభకోణమని సీఈఆర్‌టీ–ఐఎన్ తెలిపింది. నిజానికి వారు ప్రదర్శించే ఒత్తిడి వ్యూహాలకు లొంగరాదని సీఈఆర్‌టీ–ఐఎన్ తన అడ్వయిజరీలో ప్రజలను కోరింది.'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ.1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటిమోసపూరిత కాల్స్..బెదిరింపులపై ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలి. ప్రజలు ఒక్క క్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చు. నిజానికి డిజిటల్ మోసాలపై ఆందోళన చెందవద్దు. అప్రమత్తతతో ఉంటే చాలని గుర్తించాలి. నిజానికి మోసగాళ్లు ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి, ఆ తర్వాత భయపెడతారు. మనకే ఆశ్చర్యం కలిగించేలా మీ సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత తమ ఆహార్యంతో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామనే భ్రమ కల్పిస్తారు.వారెంతగా మిమ్మల్ని భయపెడతారంటే.. మనకుకు ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇప్పటికిప్పుడు తాము చెప్పినట్లు చేయకపోతే అరెస్టు తప్పదని మానసిక ఒత్తిడి తెస్తారు. దీంతో కొందరు భయంతో కష్టార్జితం మొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారు. అందుకే అప్రమత్తంగగా ఉండాలి. ఒకవేళ నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే బెదిరిపోవద్దు. వీలైతే స్క్రీన్‌షాట్ తీసి, కాల్‌ను రికార్డు చేయాలి. డిజిటల్ అరెస్టు అనేది మన చట్టాల్లో లేదు. అది ముమ్మాటికీ మోసం, వంచన, అబద్ధం. ఇలాంటి పనులు చేస్తున్నవారు సమాజానికి శత్రువులు ఆనే గుర్తించాలి. కాల్ చేసిన వారి గురించి అస్సుల పట్టించుకోవద్దు.

## కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిన కర్నూలు పోలీసులు



విభారె న్యూస్ అక్టోబర్ 28 కర్నూలు జిల్లా ప్రతినిధి..కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీ లో ఏకకాలంలో దాడులు.కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూల్ డిఎస్పి జె.బాబు ప్రసాద్ పర్యవేక్షణలో సోమవారం తెల్లవారుజామున 4వ పట్టణ సిఐ మధుసుధన్ గౌడ్ ఆధ్వర్యంలో కర్నూల్ వీకర్ సెక్షన్ కాలనీ లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.6 మంది సిఐలు,5 మంది ఎస్సైలు,75 మంది పోలీసులు పాల్గొన్నారు.రౌడీషీటర్లు,సస్పెక్ట్ లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.అనుమానితుల ఇళ్ళల్లో దాడులు నిర్వహించారు.వీకర్ సెక్షన్ కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహించారు.ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు.మంచి ప్రవర్తనతో మెలగాలని తెలియజేశారు.ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుంటే అటువంటి వారి సమాచారాన్ని అందించండి.తగిన పారితోషికం ఇస్తామని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసు అధికారులు తెలిపారు.కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీలో ఎలాంటి ధ్రువ పత్రాలు లేని 15 బైక్ లు స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సిఐలు మధుసూధన్ గౌడ్, ప్రవీణ్ కుమార్,నాగరాజరావు, పవన్ కుమార్,పార్థసారథి రెడ్డి,ఎస్సైలు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## వైయస్ షర్మిలమ్మ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి. మురళీకృష్ణ..




విభారె న్యూస్ అక్టోబర్ 28 కర్నూలు జిల్లా ప్రతినిధి .దివంగత ముఖ్యమంత్రి వర్యులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వారసురాలు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిలా రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడలో రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైయస్ షర్మిలా రెడ్డి అధ్యక్షతన ఏఐసీసీ కార్యదర్శి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కోఆర్డినేటర్ శ్రీమతి పలక్ వర్మ సమక్షంలో జరిగిన సమావేశంలో కర్నూలు జిల్లా నాయకులతో కలిసి హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే షర్మిలమ్మ దేయమని షర్మిలమ్మ ఒక ప్రణాళిక ప్రకారం జిల్లాల వారీగా సమావేశాలు జరపడం పార్టీ బలోపేతానికి పునాది అని. జిల్లా కాంగ్రెస్ కమిటీ నియోజకవర్గ ఇన్చార్జిల సమన్వయంతో పనిచేస్తే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధిస్తుందని పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని తెలియజేశారు కర్నూలు పార్లమెంటులో బీసీలు, ఎస్సీలు, మైనార్టీలు ఎక్కువగా ఉన్నారని త్వరగా నియోజకవర్గ కోఆర్డినేటర్లను నియమిస్తే వారి సమన్వయంతో ప్రతి జిల్లాలో నియోజకవర్గ కోఆర్డినేటర్లు,మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మరియు గ్రామ,వార్డు, బూత్ కమిటీలు వేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని మురళీకృష్ణ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి అంబటి రామకృష్ణ యాదవ్ జిల్లా నందలి అసెంబ్లీ నియోజక వర్గాల కోఆర్డినేటర్లు షేక్ జిలాని భాష, ఎం ఖాసిం వలి, జీ రమేష్ యాదవ్, మురళీ కృష్ణంరాజు, బి క్రాంతి నాయుడు, యు లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, డివి సాంబశివుడు ఎన్ సి బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, అనంతరత్నం, ఈ లాజరస్,వెంకట సుజాత, సాయి కృష్ణ తిప్పన్న నాయుడు,ఎన్ సుంకన్న ప్రతాపరెడ్డి మొదలగువారు పాల్గొన్నారు.

## పోలీసులపై ఎందుకీ కక్ష

### ఆ పదిమందిని వెంటనే సర్వీసులోకి తీసుకోండి – రేంవత్ సర్కార్‌కు హరీష్ రావు డిమాండ్

హైదరాబాద్,అక్టోబర్28 పది మంది పోలీసులను సర్వీస్ నుంచి తొలగించడంపై సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని కోరితే కానిస్టేబుళ్లను సర్వీస్ నుంచి తొలగించడం హేయమైన చర్య అని విమర్శించారు. తాను పోలీసు కుటుంబం నుంచి వచ్చానని, పోలీసుల కష్టాలు తనకు తెలుసని ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ఊదరగొట్టారన్ని ÷రైయ్యారు. అధికారం లేకుంటే ఒక మాట, అధికారంలోకి వచ్చాక ఇంకో మాటనా అని ప్రశ్నించారు. పోలీసుల పట్ల ఎందుకు ఇంత కర్కశంగా వ్యవహరిస్తున్నారని, వారి ఆవేదన ఎందుకు అర్థం చేసుకోవడం లేదని నిలదీశారు. భేషజాలు పక్కన పెట్టి టీజీఎస్పీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని అన్నారు. 10 మందిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించు కోవాలని చెప్పారు. సస్పెండ్ చేసిన 39 మంది కానిస్టేబుళ్లను కూడా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏక్ పోలీసు విధానాన్ని అమలు చేయాలని కోరితే 10 మంది కానిస్టేబుళ్లను సర్వీస్ నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హేయమైన చర్య. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. నేను పోలీసు కుటుంబం నుండి వచ్చిన. పోలీసుల కష్టాలు నాకు తెల్సు. ఇంట్లో భార్య, బిడ్డలు పడే బాధ నాకు తెలుసు.. అంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన రేవంత్ రెడ్డి గారు.. అధికారంలోకి వచ్చాక పోలీసుల పట్ల ఎందుకు ఇంత కర్కశంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నలు గగుప్పించారు. 10 మందిని ఉద్యోగం నుండి తొలగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకొని, సస్పెండ్ చేసిన 39 మంది కానిస్టేబుళ్లను కూడా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం' అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

## 02.11.2024 నుండి 01.12.2024 వరకు మహా గౌరీ శంకర స్వామికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం...

విభారె న్యూస్ అక్టోబర్ 28 కర్నూలు జిల్లా ప్రతినిధి..02.11.2024 శనివారం నుండి 01.12.2024 ఆదివారం వరకు పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ మహా గౌరీ శంకర స్వామి వారికి ప్రతిరోజు లఘున్యాస పూర్వక రుద్రాభిషేకము జరుగును. అత్యంత పుణ్యప్రదమైన కార్తీక మాసంలో చేసే శివారాధన విశేష ఫలితములు ఇవ్వగలదు. పరమేశ్వరుడు అభిషేక ప్రియుడు కావున కార్తీకమాస చేసే అభిషేకముల వలన మంచి శుభఫలితములు కలుగును. ఈ కార్తీకమాసంలో చేసే అభిషేక, అర్చనల వలన సమస్తమైన నవగ్రహ దోషాలు, అపమృత్యు దోషాలు, శత్రు, రుణ, రోగ, బాధలు తొలిగిపోయి ఆయురారోగ్య ఐశ్వర్యము సిద్ధించి. శివానుగ్రహం కలుగును. కార్తీక మాసంలో నెలరోజుల అభిషేక సంకల్పము:- 300/- చెల్లించిన భక్తుల గోత్రనామాలతో ప్రతిరోజు శ్రీ గౌరీ శంకర స్వామి వారికి లఘున్యాస పూర్వకరుద్రాభిషేకముజరుపబడునుసంప్రదించవలసిననెం:డి. లక్ష్మి నరసింహ శర్మ 8008774086 దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

## నేడు కౌన్సిల్ సమావేశం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 28-:- మున్సిపల్ కౌన్సిల్ సదారణ సమావేశం మంగళవారం జరగనున్న నేపథ్యంలో ప్రదానఅజెండా సిద్దమయిందని కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కమిషనర్ నిరంజన్ రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ నంద్యాల అభివృద్ధికి తగు విధంగా అజెండాను పొందుపరచడంజరిగిందన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులుకౌన్సిలర్లు అధికారులు హజరు కావాలని కోరారు. అజెండా పత్రాలను ప్రజాప్రతినిధులకు కౌన్సిలర్లకు పంపించామని తెలిపారు.

## రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుంది పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి



నంద్యాల డీసీసీ అధ్యక్షుడు నరసింహయాదవ్విభారె న్యూస్ అక్టోబర్ 28 ఆళ్లగడ్డ ప్రతినిధి :- రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందని పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి అన్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకులతో సోమవారం పీసీసీ అధ్యక్షురాలు వైస్ షర్మిల రెడ్డి భవిష్యత్తులో పార్టీ కార్యచరణలపై సమిక్షించడం జరిగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ రాబోయే రోజులో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్న , నమ్మకం ప్రజలకు ఉందని , ఈ నమ్మకాన్ని మరింతగా ప్రజలగుండెల్లో బలోపేతం చెయ్యాలని దీని కోసం జిల్లాల వారిగా, నియోజక వర్గ నాయకులు, మండల, గ్రామాల వారి గా ప్రతి ఒక్కరు కష్టపడి కాంగ్రెస్ పార్టీ నీ అధికారంలోకి తెచ్చుకోవాలసిన భాద్యత మన అందరి పై ఉందన్నారు. రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రిని చేయడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి బరగోడ్ల హుస్సేన్ భాష, ఆళ్లగడ్డ టౌన్ ప్రెసిడెంట్ గోల్డ్ హుసీ , ఆళ్లగడ్డ యుత్ ప్రెసిడెంట్ చాంద్ భాష , సిరివెళ్ల మండల కన్వీనర్ సలీం, చాగలమర్రి మండలం ఇన్ ఛార్జ్ గౌస్ , ఓబులంపల్లే ఇన్ ఛార్జ్ మహబూబ్ భాష , వంశీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గోన్నారు.

## శ్రీశైల దేవస్థాన అన్నప్రసాద వితరణ కు భక్తుల విరాళం..




విభారె న్యూస్ అక్టోబర్ 28 శ్రీశైలం..సోమవారం రోజు శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దేవస్థానంలో ప్రతినిత్యం జరిగే శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం గా రూ. 1,00,116/-లను భీమిరెడ్డి కోటిరెడ్డి, విజయవాడ వారు అందజేశారు.ఈ మొత్తాన్ని పర్యవేక్షకులు టి. హిమబిందుకు అందజేయడం జరిగింది. దాతకు తగు రశీదు, ప్రసాదాలు, స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించి,శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు.

# ఇంకా ఆగని ఆస్తి చిచ్చు

విజయవాడ, అక్టోబరు 28, జగన్‌తో ఉన్న ఆస్తుల వివాదంలో అసలేం జరిగిందో వైఎస్ షర్మిల ఓ లేఖ ద్వారా వైఎస్ అభిమానులుకు తెలిపారు. అందులో అత్యంత కీలకమైన విషయాలు ఉన్నాయి. కుటుంబ వ్యాపారాలకు జగన్ "గార్డియన్ " మాత్రమేనని .. అన్నీ వ్యాపారాలు నలుగురు మనవళ్లు, మనవరాళ్లకు సమానంగా పంచి పెట్టలనేది జగన్ మోహన్ రెడ్డి భాధ్యత అని వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిర్ణయం అన్నరు. వైఎస్ఆర్ ఉద్దేశ్యాన్ని ఆయన బిడ్డలమైన మాకు, ఆయన భార్యకు, సన్నిహితులందరికి,స్పష్టంగా తెలియచేశారని.. కేవీపీ రామచందరరావు , వైవి సుబ్బారెడ్డి , విజయసాయి రెడ్డి కి కూడా తెలుసని షర్మిల స్పష్టం చేశారు. నాన్న బ్రతికి ఉండగా స్థాపించిన అన్ని వ్యాపారాల్లో, సరస్వతి అయినా...భారతి సిమెంట్స్ అయినా... సాక్షి మీడియా, క్లాసిక్ రియాలిటీ, యలహంక ప్రాపర్టీ, ఇలాంటివి ఏవైనా... నలుగురి బిడ్డలకు సమాన వాటా ఉండాలి అన్నది వైఎస్ఆర్ మాండేట్. ( ఒక్క సందూరు మినహాయించి ). రాజశేఖర్ రెడ్డి బ్రతికి ఉన్నంత వరకు ఏ ఒక్క ఆస్తి పంపకం కూడా జరగలేదు. వైఎస్ఆర్ హఠాత్తుగా మరణించారు. ఆ తర్వాత కూడా ఏ ఆస్తి పంపకాలు జరగలేదు. ఈ రోజు వరకు నాకు న్యాయంగా రావాల్సిన ఒక్క ఆస్తి కూడా నా చేతుల్లో లేదని షర్మిల లేఖలో తెలిపారు. వైఎస్ జగన్ గురించి ఆయన సోదరి షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు జగన్ అంటే ప్రాణం అని స్పష్టం చేశారు. సుబ్బారెడ్డి తన గురించి ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఆస్తి పంపకాల ఇష్యూపై వైఎస్ షర్మిల స్పందించారు. ఈ సమస్యపై సుబ్బారెడ్డి తన గురించి ఎందుకు మాట్లాడుతున్నారు? అని ప్రశ్నించారు. ఆయన ఎవరు? అని నిలదీశారు. సుబ్బారెడ్డి జగన్ మోచేతి నీళ్లు తాగేవాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ పదవులు ఇస్తే అనుభవిస్తున్నారన్న షర్మిల.. ఇలా కాకపోతే ఎలా మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపు సాయి రెడ్డి కూడా మాట్లాడుతారు.. సాయి రెడ్డి కూడా ఆయన చేతిలోనే ఉన్నాడు కదా వ్యాఖ్యానించారు.వాళ్ల దగ్గర ఇంకా నిజాయితీ ఏమైనా ఉందా చూద్దాం అనుకున్నాను. వీళ్లందరికీ వైఎస్ఆర్ తెలుసు. ఆయన మనోభావాలు కూడా తెలుసు. అమ్మకు అర్థం కావాలి. నా వరకు నేను చెప్తున్నది నిజమని నేను ప్రమాణం చేయగలను. సుబ్బారెడ్డి కూడా ప్రమాణం చేయాలి. వైఎస్ఆర్ బిడ్డ తన బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్తుంది. వైఎస్ఆర్ ఉన్నప్పుడు భారతి సిమెంట్స్‌లో నలుగురు చిన్న బిడ్డలకు సమాన వాట ఉండాలన్నారు. ఇది ప్రమాణంగా చెప్తున్న' అని షర్మిల స్పష్టం చేశారు.ఇచ్చిన మాట ఏమయ్యింది అని జగన్ అన్నను అడిగా. జగన్ నాన్నకు మాట ఇచ్చారు. ఈ లోకంలో నీ తరువాత పాప మేలుకోరేది నేనే అని జగన్ చెప్పాడు. డోంట్ వర్రీ డాడ్ అన్నాడు. ఇది నిజం అని నా బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్తా. వైవీ సుబ్బారెడ్డి తన బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్పాలి. లేదా జగన్ మోహన్ రెడ్డి ప్రమాణం చేసి చెప్పాలి. సుబ్బారెడ్డి అంటున్నాడు.. సాక్షికి, భారతి సిమెంట్స్‌కి వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. అందుకే ఆ ఆస్తులు వాళ్లవే నట. అందులో నాకు హక్కు లేదట. జగన్ సొంతగా సంపాదించాడట' అని షర్మిల



వ్యాఖ్యానించారు.'ఆరోజు వాళ్ల పేర్లు పెట్టుకుంటే నేను అభ్యంతరం చెప్పలేదు. పేర్లతో ఏముంది అనుకున్నాను. అన్న ముచ్చట పడ్డాడు అనుకున్నాను. వాళ్ల పేర్లతో ఆస్తులు ఉంటే.. నిజంగా వాళ్లవి అవుతాయా? నా పేరు మీద ఆస్తులు రాసి ఉంటే నేను ఎందుకు జైలుకి వెళ్లలేదు అంటున్నారు. ఏ అన్న అయినా.. చెల్లెలు గిఫ్ట్ అంటే.. ఏ బంగారమో... చీరనో... గిఫ్ట్ ఇస్తారు. అంతేకాని ఆస్తుల్లో 40 శాతం వాట ఇస్తారా? ఇవ్వాలని అనుకున్నది గిఫ్ట్ కాదు.. నా హక్కు. నా హక్కు కాబట్టే నాకు ఇస్తామని అన్నారు' అని షర్మిల వివరించారు'ఇవ్వాల్సిన భాధ్యత వాళ్లకు ఉంది కాబట్టి ఎంవోయూ రాశారు. ఎంవోయూ రాయమని నేను అడగలేదు. సరస్వతి సిమెంట్స్ ఈడీ అటాచ్‌లో లేదు. అందుకే సరస్వతి సిమెంట్స్ వెంటనే ట్రాన్స్ ఫర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ఎందుకు నిలబెట్టుకోలేదు. జగన్ మోహన్ రెడ్డి అంటున్నాడు.. ప్రతి ఇంట్లో ఉండే కహాని అంట. ఇంత సునాయాసంగా ఎలా మాట్లాడుతున్నారు. మీకు సెంటిమెంట్ లేదా? ఎమోషన్ లేదా? ఈ మాటలు ఎవరో అంటే పట్టించుకొనే దాన్ని కాదు. నా సొంత చిన్నాన్నా అంటే నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. చిన్నాన్న.. నా బిడ్డలు నీ ముందు పెరగలేదా? నా బిడ్డలను మీరు తాకలేదా?' అని షర్మిల ప్రశ్నించారు.'దేవుడు అంతా చూస్తున్నాడు. అంతా గమనిస్తున్నాడు. వైసీపీ క్యాడర్‌కి నేను ఒక మాట చెప్పాలని అనుకుంటున్న.. 2019లో వైసీపీ ప్రభుత్వం 151 స్థానాలు గెలిచి ఏర్పడింది. ఇది అప్పుడు అఖండ విజయం. ఎలా సాధ్యం అయింది. ఎంతో మంది వైఎస్ఆర్ అభిమానులు అనుకుంటే వచ్చింది. ఎంతో కష్టపడితే... త్యాగాలు చేస్తే ఆ విజయం సాధ్యం అయింది. నేనే కాదు...అమ్మే కాదు..ఎంతో మంది త్యాగాలు చేశారు. నేను అమ్మ ఇద్దరం మా శక్తి కి మించి పని చేశాం' అని షర్మిల భావోద్వేగానికి గురయ్యారు.'అమ్మకు మోకాళ్ల నొప్పులు ఉండేవి. బాధలు భరించి ఏడ్చుకుంటూ పార్టీ కోసం కష్టం చేసింది. నేను కూడా 3200 కిలోమీటర్లు పాదయాత్ర చేశా. నన్ను పాదయాత్ర చేయమని అడిగితే చేశా. నన్ను ఆరోజుల్లో సూర్యుడు వరకు వెళ్లమని అన్నా కూడా వెళ్లే దాన్ని. ప్రాణాలను సైతం నేను లెక్క చేయలేదు. నాకు జగన్ అన్న అంటే ప్రాణం. వైసీపీనీ అడుగుతున్న.. నేను మీకు ఏం అన్యాయం చేశా.. ఒక్క కారణం చెప్పండి. మీకు ఏం అవసరం వస్తే అవసరానికి మించి తిరిగా' అని షర్మిల వ్యాఖ్యానించారు.'సమైక్యాంధ్ర ఉద్యమం చేయమని అడిగితే చేశా. ఓదార్పు యాత్ర చేశా. బై బై బాబు అంటూ చేసిన క్యాంపెయిన్ దేశంలో పెద్దది. మీకు ఇన్ని చేస్తే... మీరు నాకు ఏం చేశారు? మీరు నాకు, నా బిడ్డలకు అన్యాయం చేస్తున్నారు. ఇది అమ్మకు తెలుసు..అందరికీ తెలుసు. 5 ఏళ్లు మీరు రాసి ఇచ్చిన ఎంవోయూ నా చేతుల్లో ఉంది. నాకు ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. నాకు అవసరం వచ్చినా... నేను బయట పెట్టలేదు. ఎంవోయూ బయటకు పోతే వైఎస్ఆర్ గురించి నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడుతారు. నాన్న పేరు చెడగొట్టడం నాకు ఇష్టం లేదు' అని షర్మిల వివరించారు.' నాకు వేరే స్వార్థం ఉంటే నేను ఏదో ఒక మీడియా హౌజ్‌కి ఇచ్చేదాన్ని కదా. ఇవ్వాళ అందరి చేతుల్లో ఎంవోయూ ఉంది. దీనికి కారణం నువ్వు కాదా? సొంత కొడుకు తల్లిని కోర్టుకి ఈడ్చాడు. ఇది చూడటానికి నేను ఇంకా బ్రతికి ఉన్నానా అని విజయమ్మ ఏడుస్తుంది. బెయిల్ రద్దు చేసేందుకు.. నేను ఈ కుట్ర పన్నాను అంటున్నాడు. అందుకే కోర్టుకి తల్లిని ఈడ్చాడట. నీ లబ్ధి కోసం తల్లిని వాడుకుంటవా. వైఎస్ఆర్ చనిపోయాక... సీబీఐ ఛార్జ్ షీట్‌లో పేరు పెట్టించింది ఈ జగన్ కాదా? ఛార్జ్ షీట్‌లో పెట్టక పోతే.. బెయిల్ రాదని చేర్చిన మాట నిజం కాదా? నీ లబ్ధికి అమ్మా నాన్నలను వాడుకుంటారా?' అని షర్మిల నిలదీశారు.

## జగన్ కు చెక్... వయా బాలినేని



ఒంగోలు, అక్టోబరు 28, పవన్ కల్యాణ్ ఒక స్ట్రాటజీ ప్రకారం వెళుతున్నట్లే కనిపిస్తుంది. టీడీపీ కంటే ఆయన తన ప్రధాన శత్రువుగా వైసీపీని చూస్తున్నారు. వైసీ?పీని పవన్ కల్యాణ్ తక్కువగా అంచనా వేయడం లేదు. ఇప్పటికీ జగన్ కు జనంలో ఇమేజ్ ఉంది. అది ఎప్పుడైనా తమకు రాజకీయంగా ఇబ్బంది కలుగుతుందని ఆయన అంచనాలు వేసుకుంటున్నారు. చంద్రబాబు కూడా జగన్ విషయంలో ఏదో రకమైన బయటకు కామెంట్స్ చేస్తున్నప్పటికీ వైసీపీ పుంజుకుంటుందేమోనన్న భయం మాత్రం మనసులోనే ఉంది. వైసీపీ ఒకసారి రాష్ట్ర వ్యాప్తంగా పుంజుకుంటే కూటమి ఏర్పడినా ఏమీ చేయలేని పరిస్థితులు తలెత్తుతాయని తెలుసు. జనం జగన్ ను మరోసారి కోరుకుంటే తమకు పార్టీ పరంగా మరింత తీవ్ర నష్టం జరుగుతుందని భయపడిపోతున్నారు. అందుకే ఎప్పటికప్పుడు జగన్ విషయంలో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. కొత్త ఎత్తులతో రాజకీయ చదరంగంలో పావులు కదుపుతున్నారు. అయితే జగన్ నేరుగా టీడీపీ ఎదుర్కొంటే ఫ్యాన్ పార్టీ అధినేతకు మరింత సానుభూతి పెరుగుతుందని చంద్రబాబుకు తెలుసు. అందుకే అటు నుంచి నరుక్కు రావాలని చంద్రబాబు యోచిస్తున్నారు. అందుకే వైసీపీని మరింత దిగజార్చేలా చర్యలు పవన్ తీసుకుంటే బాగుంటుందని సూచించినట్లు తెలిసింది. అందులో భాగంగానే జగన్ కు బంధువు, వైసీపీ కీలక నేత అయిన ఒంగోలు మాజీ శాసనభ్యుడు బాలినేని శ్రీనివాసులు రెడ్డిని జనసేనలో చేర్చుకున్నారు. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి పదేళ్లు. ఈ పదేళ్లలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లను తక్కువ మందిని మాత్రమే చేర్చుకున్నారు. ఇప్పుడే వైసీపీ నేతలను చేర్చుకోవడానికి ప్రధాన కారణం ఆ పార్టీని మరింత బలహీనం చేయడానికే. అది రాజకీయ పార్టీగా ఎవరికైనా అవసరం. కాదనలేం. కాకుంటే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులు రెడ్డి చేర్చుకునేందుకు పవన్ మనస్తత్వానికి ఇష్టపడరు. జగన్ ను మానసికంగా వీక్ చేయాలంటే బాలినేనికి కండువా కప్పడం తప్పని సరి. అంతే కాదు ఒక ప్రధానమైన సామాజికవర్గం జగన్ ను వ్యతిరేకిస్తుందని రాష్ట్ర వ్యాప్తంగా బలంగా సంకేతాలను పంపించగలమని పవన్ కల్యాణ్ భావించారు.పవన్ కల్యాణ్ బాలినేని శ్రీనివాసులు రెడ్డిని చేర్చుకోవడం వెనక ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేష్ కూడా ఉన్నారని చెబుతారు. ఆయన పారిశ్రామిక వేత్త. ఇద్దరికీ అనుకూలమైన మిత్రుడు. జగన్ కు శత్రువు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. లింగమనేని ప్లాన్ లో భాగంగానే బాలినేని శ్రీనివాసులురెడ్డిని పార్టీలో చేర్చుకుని రెడ్లను తమవైపునకు తిప్పుకునే ప్రయత్నం పవన్ కల్యాణ్ చేసినట్లు కనపడుతుంది. త్వరలోనే బాలినేనికి పార్టీలో అత్యున్నత పదవి లభిస్తుందని తెలిసింది. ఈ పదవి ద్వారా ఆయనను రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించేలా చేసి జగన్ ను మరింత డ్యామేజీ చేయాలన్నది పవన్, చంద్రబాబు ఆలోచనగా ఉంది. అందుకు బాలినేని ఎంత మేరకు ఉపయోగపడతారన్నది కాలమే నిర్ణయించాలి.

## ఆటిజమ్ పిల్లలు తయారి ఉత్పత్తులను ప్రోత్సహించాలి

కాకినాడ,ఆటిజం పిల్లలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిందిగా ఆసరా సెంటర్ ఫర్ ఆటిజం వ్యవస్థాపకురాలు సునీత విజ్ఞప్తి చేశారు. ఆటిజం పిల్లలు రూపొందించిన దీపావళి ఉత్పత్తుల ప్రదర్శనను ప్రముఖ ఇంజనీర్ ఎస్.ఎస్. బలరాం.,కాకినాడ జిల్లా.. కాకినాడ ఎన్.ఎఫ్.సి.ఎల్ రోడ్., నున్న ఆనంద హాస్పిటల్ ప్రాంగణంలోని ఆటిజం సెంటర్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఈ పిల్లలకి ఒకేషనల్ శిక్షణ ఎంతో అవసరమని దీనిపై పేరెంట్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద పిల్లలను ఇంట్లో ఉంచకుండా ప్రతిరోజు కొంత సమయం బయట ప్రపంచాన్ని చూపించే విధంగా తీసుకు వెళ్లాలని కోరారు. మానసికంగా వారిలో ఆనందం కలిగించే విధంగా పేరెంట్స్ ప్రత్యేక విషయాలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరి పిల్లలు ఇలాగే మీరు ఉండరని వీరి ప్రపంచమే వేరుగా ఉంటుందని అయినప్పటికీ వీరి పేరెంట్స్ కి మోటివేషన్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. తమ సెంటర్లో పిల్లలు కేవలం 3 నుండి 5 గంటల పాటు ఉంటారని, మిగిలిన సమయాల్లో వారి వారి ఇంట్లో ఏదో విధంగా వారి చేత చిన్న చిన్న పనులను చేయిస్తూ ఆలోచన మరియు జ్ఞాపక శక్తి పెంచే విధంగా కృషి సూచించారు. పిల్లలు తయారు చేసిన దీపావళి వస్తువులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని వాటిని కొనుగోలు చేయడం ద్వారా వీరి శ్రమ మరియు కృషిని ప్రోత్సహించిన వారు అవుతామన్నారు. ఈ రంగంలో ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందని ప్రభుత్వం కూడా ఇటువంటి కేటగిరీలో ఉన్న పిల్లలకు ప్రత్యేక బోధనా సదుపాయాలను కల్పించాల్సిందిగా ఎన్నటినుండో విజ్ఞప్తి చేస్తున్నామని ఆమె గుర్తు చేశారు. వీరందరికీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎంతో అవసరమన్నారు. ఆటిజం పిల్లలు పనిచేస్తూ ఆనందాన్ని పొందే విధంగా ప్రతి పేరెంటు శ్రద్ధ కనపరచాల్సిన అవసరం ఉంది అన్నారు. వీరందరి చేత మరిన్ని ఉత్పత్తులను తయారు చేయడానికి అవసరమైన పరికరాలు దిగుమతి చేసుకుంటున్నామని ఆమె చెప్పారు. ఈ ప్రదర్శన ఈనెల 30 సాయంత్రం 8 గంటల వరకు ఉంటుందని వివరించారు. ఈ పిల్లలు వస్తువులను తయారు చేసే సమయంలో పేరెంట్స్ గా తమ సహాయ సహకారాన్ని కూడా అందించడం జరిగిందని, వారి ఏకాగ్రతతో చేసిన వస్తువులు చూపరులను ఆకట్టుకునే విధంగానూ పర్యావరణహితంగానూ ఉందన్నారు. ఇతర వివరాలకోసం 9246644749, 98482 29911 లో సంప్రదించవచ్చన్నారు.ఇంజనీర్ బలరాం మాట్లాడుతూ ఇటువంటి పిల్లల కోసం ప్రత్యేక సెంటర్ ను నిర్వహిస్తున్నారని వాటిలో బోధనతో పాటు పరిసరాలలో ఏ విధంగా నడుచుకోవాలో అన్న అంశంపై కూడా వివరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ ఇంజనీర్ నిహారిక(విశాఖపట్నం), అరవింద్, ఎం. నవీన్ తో పాటు పలువురు పేరెంట్స్ కూడా పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

విశాఖపట్నం,ఆనందపురం మండలం గుమ్మడివానిపాలెం హైవే వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆనందపురం నుంచి పెందుర్తి వెళ్తున్న బైక్ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీ కొట్టింది. దీంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి, బైక్ పై కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మరొకరికి తీవ్ర గాయాలుకాగా అంబులెన్స్లో ఆస్పత్రికి తరలించామన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ కేసును ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రాజకీయాలకు ఆర్కే దూరమేనా



గుంటూరు, అక్టోబరు 28, ఆయన వైసీపీలో సంచలన విజయాన్ని నమోదు చేసుకోవడమే కాదు రాష్ట్ర రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగారు. ఎన్నికల ముందు వైసీపీ నుంచి బయటికి వెళ్లిన ఆయన్ని జగన్పిలిచి మరీ మళ్లీ పార్టీలో చేర్చుకున్నారు. మళ్లీ పార్టీలోకి రావటంతో ఆయన వర్గం అంతా తమ నేత ఇక దూకుడుగా వెళ్తారు అనుకున్నారు. కట్ చేస్తే ఆయన ఎక్కడున్నారో తెలియకుండా పోయిందిప్పుడు. ఆయన వెన్నంట నేతలకు సైతం ఆయన అడ్రస్ తెలియడం లేదంట. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆ లీడర్ సడన్‌గా పొలిటికల్ స్క్రీన్ మీద నుంచి మాయమవ్వడంపై పెద్ద చర్చే జరుగుతుందిప్పుడు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019 ఎన్నికల్లో వైసీపీ ఒక్క అసెంబ్లీ సీటు తప్ప మిగిలిన అన్నీ కైవసం చేసుకుంది. అన్ని నియోజకవర్గాల్లో గెలుపేవెూ కానీ మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీగెలుపు పెద్ద సంచలనమే రేపింది. అక్కడ విజయంపై వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి. దానికి కారణం టీడీపీ అధినేత చంద్రబాబు తనయుడు నారా లోకేష్ టీడీపీ నుంచి బరిలో నిలవగా వైసీపీ నుంచి అల్లా రామకృష్ణారెడ్డి బరిలో నిలిచారు. లోకేష్ పై అల్లా రామకృష్ణారెడ్డి విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు.ఆ తర్వాత మంగళగిరి ఎమ్మెల్యేగానే కాదు రాష్ట్రస్థాయిలో ముఖ్య నేతల్లో ఒకరిగా ఆళ్ల రామకృష్ణారెడ్డి వెలుగొందారు. అమరావతి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే అయినప్పటికీ, అప్పటి ప్రభుత్వం మూడు రాజధానుల నినాదానికి అనుగుణంగా వాయిస్ వినిపించిన ఆర్కే. పలు అంశాలపై కోర్టుకెక్కుతూ నిత్యం వార్తల్లో నిలిచారు. ఒకరకంగా చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాల్లోనే ఆళ్ల రామకృ ష్ణారెడ్డి అంటే అందరికీ తెలిసేలాగా ఆయన పార్టీలో దూకుడుగా ముందుకు వెళ్లారు. ఆ క్రమంలో నియోజవర్గం పరిస్థితి ఏమో గాని పార్టీలో మాత్రం కీలక నేతగా ఎదుగు తాడని అందరూ భావించారు. అయితే ఎన్నికల ముందు బీసీ మంత్రం ఎత్తుకున్న వైసీపీ అధ్యక్షుడు జగన్ మంగళగిరి ఇన్చార్జ్‌గా చేనేత వర్గానికి చెందిన గంజి చిరంజీవిని ఇన్చార్జ్‌గా ప్రకటించారు.అప్పట్లో మంగళగిరి ప్రాంతంలో ఆర్కే తన బినామీ కాంట్రాక్టర్లలో పలు అభివృద్ధి పనులు చేయించారంటారు. ఆ పనులకు సంబంధించి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని.. కోట్ల రూపాయల్లో ఆ బిల్లులపై ఆర్కే బెంగ పెట్టుకున్నారని ప్రచారం జరిగింది. ఆ క్రమంలో అప్పటికి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్కే వైసీపీకి రిజైన్ చేసి కాంగ్రెస్‌లో చేరారు. కొన్ని రోజులు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వెంట తిరుగుతూ హడావుడి చేశారు. దాంతో ఆళ్ల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్లో కూడా కీలక నేతగా ఉండి తప్పకుండా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించడంలో కీలకంగా వ్యవహరిస్తారని అందరూ ఊహించారు. అయితే ఎన్నికలకు కొన్ని రోజుల ముందు మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో నుండి వైసీపీలోకి వచ్చేశారు. జగన్ ఆయన ఆర్థిక లెక్కలు తేల్చి వెనక్కి పిలిపించు కున్నారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఎన్నికల్లో తనకు టికెట్ లేకపోయినా వైసీపీ విజయానికి కృషి చేస్తానని ప్రకటించినప్పటికీ ప్రచారంలో కూడా ఆయన పెద్దగా కనిపించలేదు.ఇక వైసీపీ ఘోరాపరాజయం తర్వాత ఆళ్ల రామకృష్ణారెడ్డి అసలు కనిపించడమే మానేశారు. అయన రాజకీయాలకు ఎంత దూరమయ్యారంటే మంగళగిరి వైసీపీ నేతలు కూడా రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన్ని గుర్తు చేసుకోవడం మానేశారు.ఆళ్ల రామకృష్ణారెడ్డి ఒక వైసీపీకే కాదు రాజకీయాలకి కూడా దూరంగా ఉన్నారని క్లియర్‌గా కనిపిస్తుంది. మరి అది తాత్కాలికమూ? లేకపోతే శాశ్వతమూ? కాని ఆర్కే పొలిటికల్ రిటైర్‌వెంట్ తీసుకున్నట్లే కనిపిస్తుంది.

## శ్రీశైల క్షేత్ర పవిత్రతను కాపాడుకుందాం.. సీఐ ప్రసాదరావు పిలుపు


శ్రీశైల క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణానికి భంగం కలిగించకుండా స్థల పవిత్రతను కాపాడుకోవాల్సిన భాద్యత అందరిపై ఉందని శ్రీశైలం సీఐ ప్రసాదరావు అన్నారు. వివిధ ప్రాంతాల నుండి క్షేత్రానికి వచ్చే యాత్రికులతోపాటు స్థానికంగా వ్యాపారాలు చేసుకునే కొందరు దేవస్థాన నిబంధనలను అతిక్రమించడం సమంజసం కాదని హెచ్చరించారు.ఆదివారం



దేవస్థానం క్షేత్ర పరిధిలోని పలు ప్రాంతాల్లోని షాపులలో సీఐ ప్రసాదరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు పదార్థాలతోపాటు మద్యం వంటివి క్షేత్ర ప్రవేశం చేసేందుకు ప్రయత్నించినా, విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హెచ్చరికలు ఉల్లఘించి గుట్కా, ఖైనీ తదితర మత్తు పదార్థాల విక్రయాలు చేసే వారిపై ఏపీ ఆధ్యాత్మిక చట్టం 1987 23/ (1) (1) (వి) సెక్షన్ క్రింద కేసులు నమోదు చేసి ఆయా షాపులను సీజ్‌చేయనున్నట్లు సీఐ చెప్పారు.

## శ్రీశైలంలో ఇక ఆర్జిత సేవ టికెట్లన్నీ ఆన్‌లైన్‌లోనే : ఈవో చంద్రశేఖర్ రెడ్డి

శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికులతో క్షేత్ర పురవీధులు కిటకిటలాడాయి. వారాంతపు సెలవులు కావడంతో తెల్లవారుజాము నుంచే ఉభయ దేవాలయాల దర్శనాలకు భక్తులు బారులుదీరారు. స్వామివారికి గర్భాలయ అభిషేకాలు, వృద్ధ మల్లికార్జునస్వామికి బిల్వాభిషేకం, సామూహిక అభిషేకాలు, హోమాలు, అమ్మవారికి శ్రీచక్ర కుంకుమార్చన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఆలయ క్యూలైన్ల వద్ద కేవలం శ్రీఘ్ర , అతిశ్రీఘ్ర దర్శనాల టిక్కెట్లను మాత్రమే ప్రత్యేక కౌంటర్లలో



జారీ చేస్తున్నారు. ఆర్జిత సేవా టిక్కెట్లుఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేసుకోవాలని ఈవో చంద్రశేఖర్ రెడ్డి కోరారు. దర్శనార్థం వస్తున్న భక్తులకు ఉదయం అల్పాహారంతోపాటు మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయాలను దేవస్థానం వారు కల్పిస్తున్నారు.

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

### --లక్ష్మణ్ సిఐటియు పట్టణ అధ్యక్షులు



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 28-సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మునిసిపల్ వాటర్ వర్కర్స్ మరియు స్ట్రీట్ లైటింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నిసా కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ , కే మహమ్మద్ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి భాస్కరాచారి, అధ్యక్షులు కృష్ణయ్య , ఉపాధ్యక్షులు రామకృష్ణ, ఆదాము, కరిముల్లా, వెంకటేశ్వర శర్మ రామాంజనేయులు వీరతోపాటు మరో వంద మందికి పైగా మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ . కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కౌన్సిల్ సమావేశంలో అజెండా లో పొందు పరచాలని మున్సిపల్ చైర్ పర్సన్ ను కోరడం జరిగిందన్నారు . అదేవిధంగా కార్మికులందరికీ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని శానిటేషన్ కార్మికులకు ఇచ్చే వేతనాలకు సమానంగా ఇంజనీరింగ్ కార్మికులకు కూడా ఇవ్వాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వాళ్ల ఆపరేటర్లకు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలని మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

## కాస్మోటిక్ చార్జీలను పెంచండి

### ఎస్ ఎఫ్ ఐ నాయకుల డిమాండ్



-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 28-కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ఎస్ ఎఫ్ ఐ నాయకులు సోమవారం పాణ్యం తహసీల్దార్ నరేంద్రనాద్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుతం లో పెండింగ్ లో ఉన్న వసతి, విద్య దీవెన నిధులు విడుదల చేయాలన్నారు. అలాగే ప్రస్తుతం హాస్టల్ విద్యార్థులకి కేటాయించిన పదఐదువందల వున్న కాస్మోటిక్ ఛార్జిలను మూడు వేలకు పెంచాలని కోరారు. ప్రధానంగా ప్రభుత్వ హాస్టళ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత 10సంవత్సరాల నుండి యూనివర్సిటీ పోలస్టులు భర్తీ చేయలేదన్నారు . ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం కల్పించాలన్నారు. పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్ ఎఫ్ ఐ నాయకులు వేణు, రాజు తదితరు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం సభ్యులు రక్తదానం




విభారె న్యూస్ అక్టోబర్ 28 ఆళ్లగడ్డ మా ప్రతినిధి :- ఆళ్లగడ్డ పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలో శ్రీరామ ఫంక్షన్ హాల్ నందు ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం సభ్యులు నన్నే బాయ్ గారి జిలానీ, సురేంద్ర, నరేంద్ర, ఖాసిం, రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో ఆళ్లగడ్డ పట్టణ ఎస్సై షేక్ నగిన రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

# మున్సిపల్ ఆస్తులు ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 28-నంద్యాల పట్టణంలో మున్సిపల్ స్థలాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆక్రమణలకు కబ్జాలకు గురైన మున్సిపల్ స్థలాలు వాటిని పరిశీలించి స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరుతూ అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నాడు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి సోమన్న. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు గోకారి. భాషా తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూనంద్యాల పట్టణంలో 115 సంవత్సరాల చరిత్ర కలిగిన మున్సిపాలిటీకి కోట్లాది రూపాయలు విలువైన మున్సిపల్ స్థలాలు ఉన్నవి. ఆ స్థలాలను ఎవరు అధికారం ఉంటే ఆ అధికారంలో ఉన్న నాయకుడు కబ్జాలు చేసుకుని తప్పుడు సర్వే నెంబర్లతో తమ పేరు మీద రిజిస్టర్లు చేసుకుని అమ్ముకుంటూ ఆ భూములలో అక్రమ కట్టడాలు నిర్మించుకునిబాడుగలకు ఇచ్చుకుంటున్నారు. కావున ఇలాంటి భూములను పరిశీలించి స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని. మున్సిపల్ ఆస్తులు కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని. మున్సిపల్ స్టలాలపై శ్వేత పత్రం విడుదల చే చేయాలని వారు డిమాండ్ చేశారు.

# వైద్యవృత్తి ఎంతో పవిత్ర మైనది:ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఘన సన్మానం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 28-వైద్యవృత్తి ఎంతో బాధ్యతగా, జాగ్రత్తగా, వత్తిడితో చేయాల్సి ఉంటుందని, డాక్టర్ వృత్తి ఎంతో పవిత్రమైనదని, వైద్యుల సమస్యలు కూడా తాను ఒక డాక్టర్ గా బాధ్యత తీసుకొని కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఎంపీ గా తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి హామీ ఇచ్చారు. సోమవారం మధుమణి నర్సింగ్ హోం సమావేశ మందిరంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైద్యులనుద్దేశించి ఎంపీ శబరి మాట్లాడుతూ కోల్ కత్తా నగరంలో డ్యూటీ డాక్టర్ సస్య పై దాడి చేసి అత్యాచారం, హత్య చేయడం చాలా బాధేస్తోందని అన్నారు , నంద్యాల ఐ ఎం ఏ ఆధ్వర్యంలో డాక్టర్ వసుధరాణి నాయకత్వంలో వైద్యులు నల్లమల అరణ్యంలోని చెంచు ( గిరిజన ) గూడెంలకు వెళ్లి ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయం అన్నారు. నంద్యాల ఐ ఎం ఏ ఆధ్వర్యంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐ ఎం ఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి. రవికృష్ణ, మాజీ నంద్యాల అధ్యక్షురాలు డాక్టర్ వసుధరాణి, ప్రస్తుత అధ్యక్షులు డాక్టర్. సి. మధుసూదన్ రావు, కార్యదర్శి. డాక్టర్ ఫణిత్ కుమార్, సీనియర్ డాక్టర్ గెలివి సహదేవుడు, వైద్యులు విజయభాస్కర్ రెడ్డి, అనిల్ కుమార్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం







విభారె న్యూస్ అక్టోబర్ 28 ఆళ్లగడ్డ ప్రతినిధి :- ఆళ్లగడ్డ పట్టణం లోని శ్రీరామ ఫంక్షన్ హాల్ లో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆళ్లగడ్డ డి.ఎస్.పి రవికుమార్ పాల్గొని స్వయంగా రక్తదానం చేశారు. ఆయనతోపాటు పోలీస్ సబ్ డివిజన్లోని సి.ఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అనంతరం డీఎస్పీ రవికుమార్ మాట్లాడుతూ దేశంలో శాంతి భద్రతల సంరక్షణలో ఎందరో పోలీసులు ప్రాణత్యాగం చేయడం జరిగిందన్నారు. రక్తదానం వల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారమవుతామన్నారు .ఈ సందర్భంగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన కళాశాల విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు, పోలీస్ సిబ్బందిని డి.ఎస్.పి రవికుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వెస్లీ, ఆళ్లగడ్డ టౌన్ సిఐ చిరంజీవి, కోయిలకుంట్ల సీఐ హనుమంత నాయక్, సిరివెళ్ల సిఐ వంశీధర్ ,ఎస్.ఐ.లు షేక్ నగీనా, జయప్ప , రమేష్ రెడ్డి, రమణయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శుక్రవారం అమావాస్య సందర్భంగా కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు...



విభారె న్యూస్ అక్టోబర్ 28 కర్నూలు జిల్లా ప్రతినిధి.. శుక్రవారం అమావాస్య సందర్భంగా సూర్యనారాయణ స్వామి దేవాలయంలో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి శత్రు నివారణ, బాలగ్రహ దోష నివారణ, శని గ్రహ దోష నివారణ, బుద్ధి,బలం,యశో,ధైర్యం, కార్యసిద్ధి, కొరకు ఉదయం 10 గంటలకు సింధూరార్చన జరుగును. పూజలో పాల్గొన్న భక్తులకు ఆంజనేయ స్వామి డాలరు సింధూరం ప్రసాదంగా ఇవ్వబడును.రుసుము 250-/సంప్రదించవలసిన నెం :- అశోక్ కుమారాచార్యులు 9032577369..దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

## రక్తదానం చేయడం వల్ల ఇంకో వ్యక్తికి పునర్జన్మ కల్పించడమే:జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా




---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 28-రక్తదానం చేయడమనేది ఇంకో వ్యక్తికి పునర్జన్మ కల్పించడమేనని జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల లో భాగంగా నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆద్వర్యంలో సోమవారం మెడికల్ క్యాంప్ మరియు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు .ప్రతీ సంవత్సరం పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో అక్టోబర్ 21 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పోలీసుల కుటుంబ సభ్యులు సంక్షేమం కోసం మరియు పోలీసు సిబ్బందికి అనారోగ్య సమస్యల నుండి తొలగిపోయి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి నంద్యాల శాంతిరాం హాస్పిటల్ వైద్య బృందం డాక్టర్ .అరుణ, .ఉదయ మోహన్ .సుధాకర్ రెడ్డి ,.గౌతమి,.దాక్షాయణి వారి సహకారంతో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు . అంతేకాక రెడ్ క్రాస్ సొసైటీ వారి బృందం దస్తగిరి, ఉస్మాన్ బాష,మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి ,టెక్నీషియన్ మల్లికార్జున,దామోదర్, ఇర్ఫాన్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ లలో నిర్వహించారు. నేడు జిల్లా వ్యాప్తంగా సుమారు 167 మంది స్వచ్ఛందంగా పాల్గొని రెడ్ క్రాస్ సొసైటీ,గవర్నమెంట్ హాస్పిటల్ మొదలగు వారికి రక్త దానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ గారితో పాటు జిల్లా అదనపు ఎస్పీ ఎన్ .యుగంధర్ బాబు సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు, ఆర్మూడు రిజర్వ్ పోలీస్ అధికారులు, రెడ్ క్రాస్ సిబ్బంది మరియు శాంతిరం హాస్పిటల్ వారి వైద్య బృందం పాల్గొన్నారు.

## ఫిర్యాదులను నిర్ణీత గడువు లోపల పరిష్కరించండి :జిల్లా ఎస్పీ. అధిరాజ్ సింగ్ రాణా



- - - విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 28--జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 115 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయని తెలిపారు .ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు ప్రతి సోమవారం మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డిఎస్పి కార్యాలయాల్లో జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా ప్రజా సమస్యల ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ ఎన్ .యుగంధర్ బాబు పాల్గొన్నారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**